సాక్షి జగిత్యాల

గురువారం । 7 । డిసెంబర్ । 2023



నృసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయానికి రూ.1.20 లక్షల ఆదాయం సమకూరింది.



ఎన్నికల అధికారులకు అభినందన

జగిత్యాల: ఎన్నికలు సమర్థవంతంగా పూర్తిచేసినట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. అధికారులు, సిబ్బందిని బుధవారం కలెక్టరేట్‌లో అభినందించారు.

గరిష్టం/కనిష్టం
27.0/18.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురుస్తాయి. మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

పాలస్తేశ్వరస్వామి సన్నిధిలో జిల్లా అడిషనల్ జడ్జి



పూజలు చేస్తున్న జడ్జి నారాయణ

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలం పొలాసలోని శ్రీపాలస్తేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం జిల్లా అడిషనల్ జడ్జి నారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు వారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వేణుగోపాల్, అర్చకులు గోవర్ధన్, గోపాల్, సిబ్బంది రవి, భార్గవ్ పాల్గొన్నారు.

అంజన్న హుండీ ఆదాయం రూ.48 లక్షలు



హుండీ లెక్కింపులో శ్రీరాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న స్వామివారి ఆలయ హుండీలను బుధవారం ఆలయ ఈవో వెంకటేశ్ ఆధ్వర్యంలో లెక్కించారు. 28రోజులకుగాను రూ.48,83,262తోపాటు ఎనిమిది గ్రాముల మిశ్రమ బంగారం, 2.6కిలోల మిశ్రమ వెండి, 56 విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. కరీంనగర్ దేవాదాయ శాఖ ఏసీ చంద్రశేఖర్, ఏఈవో శ్రీనివాస్, ఆలయ సూపరింటెండెంట్ సునీల్‌కుమార్, శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

ప్రణాళికతో విద్యార్థుల ప్రగతి



మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు కవిత

రాయికల్: ప్రణాళికాబద్ధంగా బోధిస్తే విద్యార్థుల ప్రగతి సాధ్యమని రాష్ట్ర పరిశీలకులు కవిత అన్నారు. బుధవారం రాయికల్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల ప్రాథమిక పాఠశాలల సముదాయ సమావేశాన్ని ఆమె పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధనోపకరణాలను తయారుచేసి విద్యార్థులు కనీస సామర్థ్యాలు సాధించేలా కృషి చేయాలన్నారు. విద్యార్థుల ప్రగతిని యాప్‌లో నెలవారీగా నమోదు చేయాలని సూచించారు. పాఠశాలల్లో నిర్వహిస్తున్న వినూత్న కార్యక్రమాలు, తొలిమెట్టు, బోధన పద్ధతులపై చర్చించారు. ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ సౌజన్య, పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు కావు శ్రీనివాస్, మండల నోడల్ అధికారి శ్రీపతి రాఘవులు, జిల్లా రిసోర్స్ పర్సన్ కడకుంట్ల అభయ్‌రాజ్, సీసీవో వెంకటేశ్వర్‌రావు, సీఆర్పీలు కుడుకల రవీందర్, సత్యనారాయణ, రాజేశ్ పాల్గొన్నారు.

ఇక 'పల్లె పోరు'



- ఫిబ్రవరి ఒకటితో ముగియనున్న పంచాయతీల గడువు
- సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్లకు ఎస్ఈసీ ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో పంచాయతీరాజ్ ఆకస్మిక సమావేశాలు
- పెరిగిన ఓట్లతో స్వల్పంగా పెరగనున్న పోలింగ్ కేంద్రాల సంఖ్య

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/సాక్షి, పెద్దపల్లి: అసెంబ్లీ పోరు ముగిసిన నేపథ్యంలో మరో ఎన్నికల పోరుకు తెరలేవనుంది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు రాష్ట్రఎన్నికల సంఘం(ఎస్ఈసీ) సిద్ధం అవుతోంది. ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లాల కలెక్టర్లకు ఎస్ఈసీ ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగా సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్లకు సంబంధించిన వివరాల కోసం జిల్లాల వారీగా నివేదికలు పంపాలని ఆదేశాలు జారీచేసింది.

ఫిబ్రవరి ఒకటితో ముగియనున్న పదవీకాలం

వచ్చే ఏడాది(2024) ఫిబ్రవరి ఒకటో తేదీన సర్పంచుల పదవీకాలం ముగియనుంది. ఆర్టికల్ 2(4)(3) ప్రకారం గ్రామపంచాయతీల పదవీకాలం ఐదేళ్లు. పంచాయతీరాజ్ యాక్ట్14(2) ప్రకారం గ్రామ పంచాయతీల పదవీకాలం ముగియడానికి మూడు నెలల ముందుగానే ఎన్నికలు నిర్వహించాలి. ఈ మేరకు ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వానికి ముందస్తుగా సమాచారం ఇస్తుంది. అలాగే తగిన ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేస్తుంది. ఆ మేరకు రిజర్వేషన్లకు సంబంధించి గ్రామ కార్యదర్శులు ఎన్నికల అధికారులకు నివేదికలు పంపాల్సి ఉంటుంది. వాటిని క్రోడీకరించిన తర్వాత రిజర్వేషన్లతో సహా ఎన్నికల తేదీలు ప్రకటిస్తారు. అందులో భాగంగానే తాజాగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల కలెక్టర్లకు ఆదేశాలు వచ్చాయి. ఎన్నికల సిబ్బంది, సాంకేతిక అంశాల పరంగా సంసిద్ధంగా ఉండాలని ఆదేశాల్లో ఎస్ఈసీ స్పష్టంచేసింది. ఈ మేరకు జిల్లా పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఆకస్మిక సమావేశం నిర్వహించిన జిల్లా అధికారులు.. ఎస్ఈసీ సూచనలు, ఎన్నికల ప్రక్రియ, అనుసరించాల్సిన వ్యూహం, మానవ వనరులు, సాంకేతిక అంశాలపై చర్చించారు.

పెరిగిన ఓట్లు.. బూత్‌లు పెరిగేనా!

ఉమ్మడి జిల్లాలో 2018 ఎన్నికల నాటికి 13 నియోజకవర్గాల్లో 27,88,092 మంది ఓటర్లు ఉండగా.. తాజాగా జరిగిన ఎన్నికల్లో 31,12,283 మందికి చేరుకున్నారు. కొత్తగా 3,24,191 మంది ఓటర్లు వచ్చారు.

మరిన్ని పెరిగే అవకాశం..

గ్రామ పంచాయతీ ఎన్నికల తేదీ నాటికి కొత్త ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. తాజాగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు 200 మంది ఓటర్ల వరకు ప్రతీ పోలింగ్ బూత్‌కు ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక పోలింగ్ ఆఫీసర్ ఉండాలని, 201 నుంచి 400 ఓట్ల వరకు ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఇద్దరు పోలింగ్ ఆఫీసర్లు, 401 నుంచి 650 ఓటర్ల వరకు ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ముగ్గురు పోలింగ్ ఆఫీసర్లు ఉండాలి. ఈ మేరకు సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపింది. 650 ఓట్లు దాటితే అధికారులు అదనంగా పోలింగ్ బూత్ ఏర్పాటు చేయనున్నారు.

పెరిగిన ఓటర్ల సంఖ్య ఇలా..

నియోజకవర్గం	కొత్త ఓటర్లు
కోరుట్ల	20,652
జగిత్యాల	24,021
ధర్మపురి	17,890
రామగుండం	25,882
మంథని	23,591
పెద్దపల్లి	23,591
కరీంనగర్	54,831
చొప్పదండి	16,957
వేములవాడ	25,451
సిరిసిల్ల	22,408
మానకొండూర్	15,909
హుజూరాబాద్	35,181
హుస్నాబాద్	14,005

ఉమ్మడి జిల్లా పంచాయతీల సమాచారం

జిల్లా	మండలాలు	పంచాయతీలు	వార్డులు
పెద్దపల్లి	14	263	2436
జగిత్యాల	20	380	3500
సిరిసిల్ల	13	255	2444
కరీంనగర్	16	313	2966

మూడు దశల్లో ఎన్నికలు..!

జనాభా దామాషా పద్ధతిన రిజర్వేషన్లు ఖరారు కానున్నాయి. గ్రామాల్లోని జనాభాను బట్టి బడుగు, బలహీనులు పోటీ చేసే అవకాశాలు ఉంటాయి. అయితే, ఈసారి.. ఐదేళ్ల కింద జరిగిన పద్ధతిలోనే బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఈసారి కూడా గతంలో లాగానే మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలిదశలో వినియోగించుకున్న సిబ్బందిని మూడోదశలోనూ వినియోగించనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,211 గ్రామాలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే, కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఇంకా గ్రామస్థాయిలో రాజకీయ పరిస్థితులను అధ్యయనం చేయాల్సి ఉంది. ఆ తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తుంది. అయితే, గడువులోగానే ఎన్నికలు నిర్వహిస్తుందా..? లేక మరికొంత సమయం తీసుకుంటుందా..? అనేది వేచిచూడాలి.

మంత్రివర్గంలో మనోళ్లు?!

- దుద్దిళ్ల, పొన్నంలకు చోటు
- జీవన్‌రెడ్డికి సైతం అవకాశం


పొన్నం ప్రభాకర్


శ్రీధర్‌బాబు


జీవన్‌రెడ్డి

సాక్షిప్రతినిధి,కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ సారథ్యంలో సీఎంగా గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్న ఎనుముల రేవంత్‌రెడ్డి కేబినెట్‌లోకి ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురిని మంత్రివర్గంలోకి చోటు లభించనున్నట్లు సమాచారం. రాష్ట్రం ఏర్పాటయ్యాక మూడోసారి కొలువుదీరనున్న మంత్రివర్గంలోకి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హుస్నాబాద్ నుంచి విజయం సాధించిన పొన్నం ప్రభాకర్‌కు మంత్రివర్గంలో స్థానం లభించడం ఖాయమైనట్లు సమాచారం. సీనియర్ నాయకుడు తాటిపర్తి జీవన్‌రెడ్డికి సైతం మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించేందుకు కాంగ్రెస్ అగ్రనాయకత్వం యోచిస్తోంది. పెద్దపల్లి జిల్లాకు చెందిన మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు గతంలో వైఎస్సార్, కిరణ్‌కుమార్‌రెడ్డిల కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన అనుభవంతోపాటు ఎన్నికల మేనిఫెస్టో చైర్మన్‌గా వ్యవహరించారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా పనిచేసి పార్టీ అధిష్టానం దృష్టిలో పడ్డారు. బ్రాహ్మణ సామాజికవర్గం నుంచి గెలిచిన శ్రీధర్‌బాబుకు అన్ని అర్హతలూ ఉన్నాయని, కీలక పదవీ వరించనుందని విశ్వసనీయ సమాచారం. మాజీ ఎంపీగా, గతంలో మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా పనిచేయడమే కాకుండా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర బాధ్యులుగా వ్యవహరించి పార్టీ అధిష్టానం దృష్టిలో గుర్తింపు పొందిన హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన పొన్నం ప్రభాకర్‌కు బీసీ కోటాలో మంత్రి పదవి వరించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో పార్లమెంట్‌లో ఆయన పాత్రతోపాటు సామాజిక సమీకరణాల్లో పొన్నం ప్రభాకర్ ముందు వరుసలోనే ఉన్నట్లు వినికిడి. సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, జగిత్యాల ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డిని అనుభవం రీత్యా మంత్రివర్గంలోకి తీసుకొని ఆయన సేవలను వినియోగించుకోవాలని పార్టీ అధిష్టానం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు అమాత్యులుగా ప్రమాణం చేయనున్నారని సమాచారం.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ లత



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: అంబేడ్కర్ ఆశయ సాదనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అదనపు కలెక్టర్ లత అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ఎదగాలని, రాజ్యాంగం గురించి తెలుసుకోవాలని పేర్కొన్నారు. 18 ఏళ్ల యువత ఓటరుగా నమోదు చేసుకుని ఉత్సాహవంతంగా ఓటు వేశారని తెలిపారు. సమాజంలో మెజార్టీ చెప్పిందే న్యాయమని అన్నారు. మహిళలు ఎక్కువగా ప్రతీది గమనిస్తారని, గృహానికి కావాల్సినవి సమకూర్చుకుంటారని వివరించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమాధికారి రాజ్‌కుమార్, కార్పొరేషన్ ఈడీ లక్ష్మీనారాయణ, డీఆర్డీఏ పీడీ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.




స్వామివారి మూలవిరాట్



కోరుట్ల స్వామివారి శోభాయాత్ర

కన్నులపండువగా ఆరట్టు

కోరుట్ల, రాయికల్‌లో అయ్యప్పస్వామి ఆరట్టు ఉత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌ను రథంపై ప్రతిష్ఠించి పురవీధులమీదుగా శోభాయాత్ర చేపట్టారు. రాయికల్‌లో మునుగోటి సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో స్థానిక పెద్ద చెరువులో.. కోరుట్లలో అతి పురాతన మహాదేవస్వామి ఆలయంలోని కోనేరులో చక్రస్నానం చేయించారు. అయ్యప్ప స్వాముల భజనలు, పాటలు, నృత్యాలు పట్టణ ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ సభ్యులు, పురోహితులు, గురు స్వాములు పాల్గొన్నారు.



కోరుట్ల: చక్రస్నానంలో అయ్యప్పస్వాములు



రాయికల్: శోభాయాత్రలో భక్తులు

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాపై తుపాన్ ప్రభావం
- పొద్దంతా చిరుజల్లులు
- ఇబ్బంది పడుతున్న రైతులు



ధాన్యంపై కవర్లు కప్పుకుంటున్న రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్ ప్రభావంతో జిల్లాలో రెండురోజులుగా చిరుజల్లులు కురుస్తున్నాయి. దీంతో జిల్లావ్యాప్తంగా ప్రారంభించిన కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. జల్లులు ఎప్పుడు ఆగుతాయో..? ధాన్యం ఎప్పుడు తూకం వేస్తారో.. తెలియక రైతులు అయోమయానికి గురవుతున్నారు. అయితే యాసంగిలో సాగుచేస్తున్న మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలకు పెద్దగా నష్టం వాటిల్లలేదు. జిల్లాలో అక్కడక్కడ సాగు చేసిన కూరగాయల పంటలు, మిర్చి వంటి పంటల్లో పూతకు ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. చాలా రోజులు వాతావరణం ఇలాగే ఉంటే మామిడి పూతకు ఇబ్బందిగా మారే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వాతావరణం మబ్బులతో కమ్ముకుని చలి తీవ్రత పెరుగుతోంది. వృద్ధులు, పిల్లలు బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. బుధవారం జిల్లా అంతటా చిరుజల్లులు కురిశాయి. మరోవైపు పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి.

రైతులకు తప్పని ఇబ్బందులు

ప్రస్తుతం ధాన్యం విక్రయింపే సీజన్ కావడం.. ధాన్యమంతా కొనుగోలు కేంద్రాల్లో.. కల్లాల్లోనే ఉంది. వాతావరణం మబ్బులతో చిరుజల్లులు కురుస్తుండడంతో చాలామంది రైతులు ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తున్నారు. క్వింటాల్ రూ.1800 నుంచి రూ.1900కు నేరుగా రైస్‌మిల్లులకు విక్రయిస్తున్నారు. ఇప్పటివరకు, సింగిల్‌విండో ద్వారా 12.97 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అలాగే మహిళా సంఘాల ద్వారా 6.70 లక్షల క్వింటాళ్లు కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నా.. మరో 4 నుంచి 5 లక్షల క్వింటాళ్ల వరకు ధాన్యం కేంద్రాల్లోనే ఉందని భావిస్తున్నారు. వర్షం ప్రభావంతో మరో 80వేల క్వింటాళ్ల వరకు ధాన్యం కేంద్రాల్లోనే ఉన్నాయి. భోజనానికి ఉపయోగించే సన్నధాన్యం పండించిన రైతులు బాగా ఆరబెట్టి మిల్లింగ్ చేయించి, నేరుగా అమ్ముతుంటారు. ప్రస్తుతం చిరుజల్లులతో సన్నని వరి ధాన్యాన్ని రైతులు ఆరబెట్టే పరిస్థితులు లేక ధాన్యం రైతుల్ల ఇళ్లలోనే నిల్వ ఉంది.

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

వర్షం ప్రభావం ఉండటంతో ధాన్యంలో తేమ శాతం రావడం లేదు. దీంతో కొనుగోళ్లు మందగించాయి. రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తుండటంతో కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోయాయి. రైతులు ధాన్యంరాశులపై టార్పాలిన్ కవర్లు కప్పుకొన్నారు. ఎండ ఎప్పుడు వస్తుందో, ధాన్యం ఎప్పుడు ఆరుతుందో, ఎప్పుడు కొనుగోళ్లు జరుగుతాయో తెలియని అయోమయ పరిస్థితి రైతుల్లో నెలకొంది. కొంతమేర తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు కూలీలకు రెట్టింపు ఖర్చు పెట్టి, నానాతిప్పలు పడాల్సిన దుస్థితి నెలకొంది.

ఆలస్యంతో రంగు మారే అవకాశం

ధాన్యం కొనుగోళ్లు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. తేమ సాకుతో మరికొద్ది రోజులు ఆలస్యమైంది. తాజాగా వర్షం ప్రభావంతో కొనుగోళ్లకు ఫుల్‌స్టాప్ పడింది. తడిసిన ధాన్యం ఆరిన తర్వాత, నిబంధనల మేరకు తేమ శాతం వస్తేనే తూకం వేసే పరిస్థితి ఉంది. తడిసిన ధాన్యం సరిగ్గా ఆరకపోతే నల్లబడే పరిస్థితి నెలకొంది. మిల్లర్లు కూడా ఏవేవో కొర్రీలు పెట్టి తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోలుకు ససేమిరా అనే అవకాశం ఉందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ధాన్యంపై కవర్లు కప్పుకున్నాం



వర్షం ప్రభావంతో ధాన్యం కుప్పలపై కవర్లు కప్పుకున్నాం. కవర్లు ఉన్నాయో, లేవోనని ప్రతిరోజూ రెండు, మూడు సార్లు కొనుగోలు కేంద్రానికి వెళ్లి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధాన్యం తడిస్తే ఆరబెట్టడం ఇబ్బందే.

– క్యాతం సాయిరెడ్డి, సింగరావుపేట, రాయికల్

త్వరగా తూకం వేయాలి



కేంద్రానికి తెచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తూకం వేస్తే రైతులకు వర్షం ఇబ్బందులుండవు. తడిసిన ధాన్యం ఆరబెడుదామన్న ఆరే పరిస్థితి లేదు. వర్షంతో కొనుగోళ్లు ఆపేశారు. ఎన్ని రోజులు పడుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది.

– కోల నారాయణ, చల్‌గల్

వ్యవసాయ ఆధారం.. బ్యాంకులు సాకారం

- జిల్లాలో 127కు వివిధ బ్యాంకు శాఖలు
- రూ.4,691.26 కోట్ల డిపాజిట్లు
- ముందువరుసలో నిలుస్తున్న జిల్లా



జిల్లాకేంద్రంలోని లీడ్‌బ్యాంక్

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, వరద కాలువ, చెరువులు, కుంటలతో కళకళలాడుతుండగా.. అదేస్థాయిలో ఇక్కడ పంటలు కూడా పండుతాయి. బావులు, బోర్లలో పుష్కలంగా నీటిలభ్యత ఉండడంతో ఆహార, వాణిజ్యపంటల ఉత్పత్తి కూడా ఎక్కువే. ఆధునిక సాగు పద్ధతులు అవలంబించడంతోపాటు పసుపు, చెరుకు వంటి వాణిజ్య పంటల సాగవుతాయి. మహిళారైతుల్లో కష్టపడేతత్వం జిల్లాకు కలిసివస్తోంది. ఇలా రైతు కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుతుండటంతో వివిధ బ్యాంకులు తమ శాఖలను ఇక్కడ విరివిగా విస్తరిస్తున్నాయి.

127 బ్యాంకు శాఖలు

రెండేళ్ల క్రితం వరకు జిల్లాలోని 18 మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల శాఖలు 60 నుంచి 70 వరకు ఉండేవి. రెండేళ్లలోనే అవి 127కు చేరాయి. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో 70, మండలస్థాయిలో (సెమీఅర్బన్) 42, అర్బన్(పట్టణస్థాయి)లో 15 బ్యాంకు శాఖలు ఖాతాదారులకు సేవలు అందిస్తున్నాయి. వీటిలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు 29, యూనియన్ బ్యాంకు, ఎస్‌బీఐ వంటి ప్రభుత్వ రంగ బ్యాంకులు 53, యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ వంటి ప్రైవేట్ బ్యాంకులు 24, సహకార బ్యాంకులు 21 శాఖలను ఏర్పాటు చేసి సేవలు కొనసాగిస్తున్నాయి. మండలాల వారీగా పరిశీలిస్తే జగిత్యాల అర్బన్‌లో 33, మెట్‌పల్లిలో 16, కోరుట్లలో 15, రాయికల్‌లో 7, కథలాపూర్‌లో 6, వెలగటూర్‌లో 6, ధర్మపురిలో 5, మేడిపల్లిలో 5, మల్లాపూర్‌లో 5, కొడిమ్యాలలో 5, మల్యాలలో 5, పెగడపల్లిలో 5, గొల్లపల్లిలో 4, ఇబ్రహీంపట్నంలో 4, జగిత్యాల రూరల్‌లో 3, సారంగాపూర్‌లో 1, బీర్‌పూర్‌లో 1, బుగ్గారంలో ఒకటి చొప్పున ఉన్నాయి. మొత్తంగా మూడు గ్రామాలకో బ్యాంకు శాఖలు పనిచేస్తున్నాయి. ఆయా బ్యాంకుల్లో కలిపి సుమారు మూడు లక్షల మంది వరకు ఖాతాదారులు ఉన్నారు.

మూడు మండలాల్లో ఒక్కో శాఖ

వ్యాపారపరంగా పోటీపడుతున్న బ్యాంకులు ఎక్కువగా అర్బన్, సెమీఅర్బన్ స్థాయిలోనే శాఖలను విస్తరిస్తూ.. గ్రామీణ ప్రాంతాలను విస్మరిస్తున్నాయి. ఇప్పటికీ సారంగాపూర్, బుగ్గారం, బీర్‌పూర్ మండలాల్లో ఒక్కో బ్యాంకు శాఖ మాత్రమే ఉండడం గమనార్హం. చుట్టుపక్క గ్రామాల ప్రజలు బ్యాంకు సేవల కోసం ఆయా బ్యాంకు ప్రాంతాలకు రావడం కష్టంగా మారింది.

ఏటా పెరుగుతున్న డిపాజిట్లు

రైతులు ఆర్థిక వృద్ధి సాధిస్తుండడంతో బ్యాంకులు శాఖలు విస్తరించి పోటీపడి డిపాజిట్లు సేకరిస్తున్నాయి. జిల్లాలోని 127 బ్రాంచీల ద్వారా 2018–19లో రూ.3,590.57 కోట్లు, 2019–20లో రూ.3,934.06 కోట్లు, 2020–21లో రూ.4484.13 కోట్లు, 2021–22లో రూ.4,835.16 కోట్లు, 2022–23లో రూ.4691.26 కోట్లు డిపాజిట్ల రూపంలో సేకరించడం గమనార్హం. ఖాతాదారులకు అవసరమైన పంటరుణాలతోపాటు ధీర్ఘకాలిక, వ్యాపార రుణాలు అందించడంలోనూ బ్యాంకులు ముందుంటున్నాయి. 2018–19లో రూ.2982.21 కోట్లు, 2019–20లో రూ.3539.42 కోట్లు, 2020–21లో రూ.4215.48 కోట్లు, 2021–22లో రూ.5110.07 కోట్లు, 2022–23లో రూ.5922.1 కోట్ల రుణాలు అందించాయి. ఖాతాదారులు సైతం బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు సక్రమంగా చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. రికవరీని పరిశీలిస్తే 2018–19లో 83 శాతం, 2019–20లో 90 శాతం, 2020–21లో 94 శాతం, 2021–22లో 105.69 శాతం, 2022–23లో 126.24 శాతంగా నమోదైంది.

బ్యాంకు నుంచే రుణం



భూమి ఏ మేరకు ఉంటే ఆ మేరకు బ్యాంకులు పంట రుణం ఇస్తున్నాయి. నేను రూ.లక్ష వరకు పంట రుణంగా తీసుకున్న. రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు పంట రుణంతో పాటు ట్రాక్టర్ వంటి యంత్రాల కొనుగోలుకు కూడా బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. – మహేందర్ రెడ్డి, తొంబరావుపేట, మేడిపల్లి(మం)

మెరుగైన సేవలు



బ్యాంకుల ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. ఏటా రూ.ఐదువేల కోట్లకు పైగా రైతులు, ప్రజలు, స్వశక్తి సంఘాలకూ స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు ఇస్తున్నాం. ఇతర జిల్లాలతో పోల్చితే జిల్లాలో బ్యాంకులు ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నాయి.

– వెంకట్‌రెడ్డి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్

క్లుప్తంగా

యువ వైద్యురాలి అదృశ్యం

కరీంనగర్ క్రైం: నగరంలోని ఓ ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్‌గా పని చేసే యువతి అదృశ్యమైనట్లు వన్ టౌన్ సీఐ రవికుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నగరంలోని కోతి రాంపూర్‌కు చెందిన యువతి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డ్యూటీ డాక్టర్‌గా విధులు నిర్వహిస్తోంది. గత 20 రోజులుగా ఇంటి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు తెలిసినవారి ఇళ్లలో, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వృద్ధురాలు..

కరీంనగర్ క్రైం: నగరంలో ఓ వృద్ధురాలు అదృశ్యమైనట్లు వన్ టౌన్ సీఐ రవికుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలంలోని చామనపల్లికి చెందిన విలాసాగరం కొమురయ్య కరీంనగర్‌లోని అశోకనగర్‌లో కొత్తగా నిర్మిస్తున్న ఇంటికి వాచ్‌మెన్‌గా పని చేస్తూ తన భార్య గౌరమ్మతో అక్కడే ఉంటున్నాడు. ఆమె పదేళ్లుగా మానసిక వ్యాధితో బాధ పడుతోంది. అప్పుడప్పుడు ఆలయాలకు వెళ్లి వస్తుండేది. గత నెల 25న బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. తెలిసినవారి ఇళ్లలో, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కొమురయ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

జాబ్ మేళాకు స్పందన



నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులు

కరీంనగర్‌సిటీ: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (టీఎస్‌కేసీ) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు స్పందన వచ్చింది. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. పీజీ, యూజీ, ఫైనల్ సెమిస్టర్ విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. గత అయిదేళ్లలో 565 మంది ఉద్యోగాలు సాధించారని అన్నారు. టీఎస్‌కేసీ కో–ఆర్డినేటర్ శోభారాణి మాట్లాడుతూ.. జాబ్‌మేళాలో 180 మంది అభ్యర్థులు పాల్గొన్నారని తెలిపారు. కంటెంట్ క్రియేటర్, ఎస్‌ఈవో ఎక్స్‌పర్ట్, వీడియో ఎడిటర్, పోస్టర్ డిజైన్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్స్, టీం లీడర్స్ తదితర ఉద్యోగాలకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కర్షన్ నిర్వహించారని అన్నారు. 25 మందిని ఎంపిక చేసి, అప్పటికప్పుడు ఆఫర్ లెటర్స్ ఇచ్చారని తెలిపారు. కంపెనీల సభ్యులు పవిత్ర, శివ, ప్రశాంత్, దివ్య, రాజశేఖర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు జమ్మికుంట మార్కెట్‌కు సెలవు

జమ్మికుంట(హుజూరాబాద్): వర్షం కారణంగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు గురువారం సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులుగా వర్షం కురుస్తోందని, మార్కెట్ క్రయవిక్రయాలకు అంతరాయం కలుగుతోందన్నారు. శుక్రవారం యథావిధిగా కొనుగోళ్లు జరుగుతాయని, రైతులు గమనించాలని కోరారు.

మత్స్యకారులకు బీ(ధీ)మా !

- రైతుబీమా తరహాలో 'పీఎం మత్స్య సంపద యోజన'
- సంఘాల్లోని సభ్యులకు సర్టిఫికెట్
- 18 నుంచి 70 ఏళ్ల సభ్యులు అర్హులు
- గాయపడినా.. మృతిచెందినా బీమా వర్తింపు
- రూ.25వేల నుంచి రూ.5 లక్షల వరకు పరిహారం

మల్లాపూర్: మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం ధీమా అందిస్తోంది. మత్స్యకారులకు 'పీఎం మత్స్య సంపద యోజన' ద్వారా బీమా సౌకర్యం కల్పిస్తోంది. మత్స్యపారిశ్రామిక సహకార సంఘాల సభ్యులు ప్రమాదంలో గాయపడినా శాశ్వత అంగవైకల్యం చెందినా మృతిచెందినా బాధిత కుటుంబాలకు 'మత్స్య సంపద యోజన' పథకం కింద బీమా పరిహారం లభించనుంది. 18 నుంచి 70 ఏళ్లలోపు ఉన్న మత్స్యకారులకు 'ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన' కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సామూహిక ప్రమాద బీమా (జీ.ఏ.ఐ.ఎస్) అమలు చేస్తున్నారు. మత్స్య సహకార సంఘాల్లో సభ్యులుగా చేరి సర్టిఫికెట్ పొందినట్లయితే ఒక్కో సభ్యుడిపై రూ.68.40 చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీమా ప్రీమియం చెల్లిస్తున్నాయి. ప్రమాదంలో మృతిచెందిన సభ్యుని కుటుంబానికి రూ.5 లక్షలు, శాశ్వత అంగవైకల్యం కలిగినట్లయితే రూ.2.50 లక్షలు, ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చేరిన మత్స్యకారులకు రూ.25 వేల బీమా పరిహారం లభించనుంది. సంఘటన జరిగిన రోజు నుంచి 90 రోజుల్లోపు జిల్లా మత్స్యశాఖ అధికారి కార్యాలయంలో వివరాలు అందిస్తే 190 రోజుల్లోపు పరిహారం మంజూరుకానుంది. ఈ పథకం ద్వారా జిల్లాలో వేలాది మత్స్యకారుల కుటుంబాలకు భరోసా లభించనుంది.

మత్స్యకారులకు భరోసా

మత్స్యకారుల కుటుంబాలకు అండగా నిలవాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రధానమంత్రి మత్స్యసంపద యోజనను ప్రవేశపెట్టాయి. చేపలవేటకు వెళ్లిన మత్స్యకారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుంది. మత్స్యకారుడు మరణిస్తే ఆ కుటుంబం వీధినపడుతుంది. రైతు కుటుంబాలను ఆదుకునేందుకు రైతుబీమా మాదిరిగానే ఆర్థిక భరోసా కల్పించనున్నారు. ఇందులో భాగంగా బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. కొత్తగా తీసుకువచ్చిన ఈ పథకంపై మత్స్యకారుల కుటుంబాలకు అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీచేసింది. మత్స్యకారులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

సర్టిఫికెట్ పొందిన వారే అర్హులు

జిల్లాలోని మొత్తం 230 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 15,552 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో 183 మత్స్యపారిశ్రామిక సహకార సంఘాల్లో 13,599 మంది సభ్యులున్నారు. 47 మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలుండగా అందులో 1,953 మంది సభ్యులు ఉన్నారు. ఈ ఏడాది మార్చి 31వరకు సభ్యులుగా చేరిన 18 నుంచి 70 ఏళ్ల మధ్య వయస్సున్న మహిళలు, పురుషులను 2,793మందిని అర్హులుగా గుర్తించారు. వీరు జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో నమోదు చేసుకుంటేనే బీమాకు అర్హులు. సర్టిఫికెట్ పొందని బీమా పథకం వర్తించదు.

పరిహారం ఇలా..

బీమా సర్టిఫికెట్ పొందిన సభ్యులు రోడ్డు, రైల్వే ప్రమాదాలు, సముద్రం, నదులు, గోదావరి, చెరువులు, కుంటలు, వాగులు, నీటి కుంటల్లో మునిగి మృతిచెందడం, గాయపడడం, తప్పిపోవడం, అగ్ని, విషపూరిత పదార్థాల నిర్వహణ కారణంగా ప్రమాదం, విద్యుత్‌షాక్, మిషనరీ లో పనిచేస్తున్నప్పుడు ప్రమాదం, హత్య, పాము, తేలు కాటు, జంతువుల దాడిలో గాయపడడం, అవయవాలు కోల్పోవడం, రేబిస్, వీటి తాలూకు వచ్చే వివిధ వ్యాధులతో మృతిచెందడం, ప్రమాదాలు జరిగినా బీమా పరిహారం వర్తించనుంది. ప్రమాదానికి గురైన బాధిత కుటుంబసభ్యులు 90 రోజుల్లోపు జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో వివరాలు అందించాలి.



మల్లాపూర్ చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారుడు (ఫైల్)

జగిత్యాల జిల్లా ప్రొఫైల్

జిల్లాలోని మొత్తం మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు	230
మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు	183
సభ్యులు	13,599
మహిళా మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు	47
సభ్యులు	1,953
పీఎం మత్స్యసంపద యోజన పథకానికి అర్హులు	2,793

బాధిత కుటుంబాలకు భరోసా



చేపల వేటకు వెళ్లిన సమయంలో అనుకోని ఘటనల వల్ల మత్స్యకారులు ప్రమాదాలకు గురైన ఘటనలు చాలా ఉన్నాయి. మత్స్యకార కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో బాధిత కుటుంబాలకు ఆర్థికంగా భరోసా కలుగుతుంది. ఇలాంటి పథకాలు ప్రవేశపెట్టడం వల్ల ఎన్నో కుటుంబాలకు మేలు కలుగుతుంది.

– ఎల్ల చిన్నదేవయ్య, మత్స్యకారుడు, మల్లాపూర్

సద్వినియోగం చేసుకోవాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన' పథకం ద్వారా బీమా కల్పిస్తోంది. మత్స్యకారుడు మృతిచెందితే రూ.5లక్షలు, శాశ్వత వైకల్యానికి గురైతే రూ.2.50లక్షలు, గాయపడితే రూ.25వేలను వారి కుటుంబానికి పరిహారం అందిస్తారు. గతేడాది మార్చి 31లోగా సంఘాల్లో చేరిన 18 నుంచి 70 ఏళ్ల వారు పథకానికి అర్హులు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– దామోదర్, జిల్లా మత్స్యశాఖ అధికారి, జగిత్యాల

ప్రణాళిక ప్రకారం బోధించాలి



మాట్లాడుతున్న ఉషారాణి

జగిత్యాల: విద్యార్థుల అభ్యాసన ఫలితాలు మెరుగుకోసం ఉపాధ్యాయులు ప్రణాళిక ప్రకారం బోధించాలని, అభ్యసన సామగ్రి తప్పనిసరిగా వినియోగించాలని స్కూల్ కాంప్లెక్స్ రాష్ట్ర అబ్జర్వర్ ఉషారాణి అన్నారు. జిల్లాలోని పలు పాఠశాలలను బుధవారం ఆమె పరిశీలించారు. విద్యార్థులకు వర్క్‌బుక్స్, టెక్స్‌బుక్స్, లెసెన్స్‌ప్లాన్స్ మూడింటి అనుసంధానంతో బోధన జరగాలని, ప్రతినెలా నిర్వహిస్తున్న తొలిమెట్టు రివ్యూ రిపోర్ట్‌ను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి రాజేశ్, జయసింహరావు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమానికి నిత్యావసర సరుకులు



సరుకులు అందిస్తున్న నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్‌కు చెందిన 3 నుంచి 9వ తరగతుల విద్యార్థులు తమవంతు సహాయంగా బియ్యం, పప్పులు, వంటనూనె, చక్కెర, పిండి తదితర నిత్యావసర సరుకులను జమ చేశారు. వాటిని విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి బుధవారం వీరబ్రహ్మేంద్రస్వామి అనాథ వృద్ధుల ఆశ్రమం, నియో ఆర్గనైజేషన్ మేనేజర్లకు అందించారు. ఈ సందర్భంగా గొప్ప ఆలోచన చేశారని ఆయన విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రిన్సి పాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



సోహెల్



ఆకుల దీక్షిత

జగిత్యాల రూరల్: మండలంలోని పొరండ్ల జెడ్పీ పాఠశాలకు చెందిన ఎండీ సోహెల్, ఆకుల దీక్షిత రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ అంజన్న తెలిపారు. ఈనెల 4న కరీంనగర్‌లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన ఎండీ సోహెల్ డిస్కస్‌త్రోలో ప్రథమస్థానం, దీక్షిత 5 కి.మీ వాకింగ్‌లో ద్వితీయస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 7 నుంచి 9 వరకు వరంగల్ హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు మోడల్‌స్కూల్ విద్యార్థులు..



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, పీడీ

జగిత్యాలరూరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జరిగిన జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో కండ్లపల్లి మోడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ నాగసుధారాణి తెలిపారు. బాస్కెట్ బాల్ అండర్ 17 బాలుర విభాగంలో మహేశ్, చరణ్, అఖిల్, అండర్ 14 బాలికల విభాగంలో రోహిత ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకాగా, బుధవారం పాఠశాల పీఈటీ వినీత్, అజీమ్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

జీవన్‌రెడ్డికి మంత్రి పదవి రావాలని పూజలు

జగిత్యాల రూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాటిపర్తి జీవన్‌రెడ్డికి మంత్రి పదవి రావాలని మండలంలోని పొరండ్ల భీమేశ్వర స్వామి ఆలయంలో కాంగ్రెస్ నాయకులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజకీయ అనుభవంతో పాటు, రెండుసార్లు మంత్రిగా, ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ప్రస్తుతం ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారని, ఎన్నికల్లో ఓడినా, గెలిచినా నిత్యం ప్రజాసేవలో ఉంటున్నారని తెలిపారు.



భీమేశ్వర ఆలయంలో కాంగ్రెస్ నాయకులు

రోడ్డుపై పారిశుధ్య కార్మికుల ధర్నా



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న పారిశుధ్య కార్మికులు

- పారిశుధ్య కార్మికుడిపై చేయి చేసుకున్న ఏఎన్‌ఎం
- కేసు నమోదు చేసిన పోలీసులు

కోరుట్ల రూరల్: పారిశుధ్య కార్మికుడిపై దాడికి దిగిన ఏఎన్‌ఎంపై పోలీసులు కేసునమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రోజులాగే పారిశుధ్య కార్మికులు బుధవారం పదో వార్డులో చెత్త సేకరిస్తున్నారు. ఏఎన్‌ఎం మధురిమ ఇంటివద్ద చెత్త సేకరిస్తున్న క్రమంలో మున్సిపల్‌లో పనిచేస్తున్న చిట్యాల మహేశ్, మధురిమ మధ్య చెత్త సేకరణ విషయంలో గొడవ జరిగింది. దీంతో అతనిపై చేయి చేసుకుంది. పారిశుధ్య కార్మికులంతా విధులు బహిష్కరించి పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో చేపట్టారు. మధురిమపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల ధర్నాకు అఖిల పక్ష నాయకులు మద్దతు తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో ఎస్సై కిరణ్ కుమార్ చేరుకొని ధర్నా విరమింపజేశారు. మహేశ్ ఫిర్యాదు మేకు మధురిమపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఇంటర్ విద్యార్థి మృతి

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని నామాపూర్‌కు చెందిన ఇంటర్మీడియెట్ విద్యార్థి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. నామాపూర్‌కు చెందిన మంగళి అక్షయ్(17) సోమవారం చీకోడు నుంచి స్నేహితుడితో కలిసి నామాపూర్ వైపు వస్తుండగా వాహనంపై నుంచి కిందపడిపోయాడు. తీవ్ర గాయాలైన అక్షయ్‌ను సిరిసిల్ల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. అక్షయ్ మృతిపై అనుమానా లున్నాయని తల్లిదండ్రులు శమంత, దేవయ్య పో లీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు.

అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

మెట్‌పల్లి: అభివృద్ధిలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు. నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన సంజయ్‌ను బుధవారం మున్సిపల్ ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్ సుజాత ఉన్నారు. అలాగే పలు సంఘాల నాయకులు కూడా ఎమ్మెల్యేను సన్మానించారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

జగిత్యాలక్రైం: విద్యుత్‌షాక్‌తో ఓ బాలుడు మృతిచెందిన ఘటన జిల్లాకేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని మహబూబ్‌పుర ప్రాంతానికి చెందిన అయాన్ (15) అలీ డెకరేషన్ పనిచేస్తాడు. గణేశ్‌నగర్‌లో బుధవారం మధ్యాహ్నం ఓ బంగ్లాపై డెకరేషన్ వర్క్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలపై పడగా అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి షరీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లిరూరల్: ఈత చెట్టుపై నుంచి పడి ఓ గీత కార్మికుడికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. పెద్దపల్లి మండలం రంగాపూర్‌కు చెందిన బొంగోని రాయమల్లు రోజూ మాదిరిగానే బుధవారం కల్లు గీసేందుకు ఈత చెట్టు ఎక్కుతుండగా జారి పడ్డాడు. దీంతో గాయాలైన రాయమల్లును చికిత్స నిమిత్తం పెద్దపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సుగ్లాంపల్లిలో చోరీ

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని సుగ్లాంపల్లిలో బుధవారం చోరీ జరిగింది. ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... సుల్తానాబాద్ మండలం పెర్కపల్లి చెందిన పల్లె సదయ్య కుటుంబ సభ్యులతో కలిసి సుగ్లాంపల్లిలో నివాసముంటున్నాడు. సదయ్య ఓ మిల్లులో వాచ్‌మన్‌గా పనిచేస్తుండగా భార్య రజిత ప్రైవేట్ పాఠశాలలో ఆయాగా పనిచేస్తోంది. బుధవారం ఇద్దరు ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. సాయంత్రం వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండగా ఇంట్లోని రూ.28వేలు నగదు, బంగారం, 10తులాల వెండి ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జాతీయస్థాయి సెస్టోబాల్ పోటీలకు ఎంపిక

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని గాయత్రీ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి సెస్టో పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన మహాలక్ష్మి, హరిణి, అస్మిత, అక్షర, స్ఫూర్తి రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికవడంపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అభినందించారు.

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



బండారి సతీశ్



ధర్మేందర్

ధర్మపురి : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను కొత్త ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు గజభీంకార్ గోవర్ధన్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పాత హరిజనవాడ కాలనీలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బుధవారం టీఆర్‌టీఎఫ్ మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముందుగా రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఉపాధ్యాయ సంఘాల తరఫున శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ మేనిఫెస్టోలోని ని ఉపాధ్యాయ, ఉద్యోగులకు సంబంధించిన మూడు డీఏలను విడుదల చేయాలని, ప్రతినెలా 1న జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పీఆర్సీలో ఫిట్‌మెంట్ ఇస్తూ పదోన్నతులు, బదిలీలు జరపాలని కోరారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. మండలశాఖ అధ్యక్షుడు బండారి సతీశ్, ప్రధాన కార్యదర్శి బైరిశెట్టి ధర్మేందర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



రాజేందర్ (ఫైల్)

వెల్గటూర్: మండలకేంద్రంలోని పెద్దవాగులో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమవడం కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం ముత్యంపేటకు చెందిన నస్పూరి రాజేందర్ (42)కు మండలకేంద్రానికి చెందిన పుట్టపాక శంకరమ్మ–కిష్టయ్య కూతురు స్రవంతితో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. రజక కులానికి చెందిన రాజేందర్ శుభకార్యాలకు వంట పనులు చేస్తుంటాడు. మంగళవారం ఉదయం పనినిమిత్తం వెలటూర్‌లోని తన అత్తగారింటికి వచ్చాడు. ఓ శుభకార్యంలో మేకలు కోసేందుకు వెళ్లి రాత్రయినా ఇంటికి రాలేదు. దీంతో బావమరిది పుట్టపాక జయందర్ మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. బుధవారం ఉదయం రాజేందర్ మృతదేహం వెల్గటూర్‌లో పెద్దవాగులో లభ్యమైంది. అయితే రాజేందర్ మంగళవారం సాయంత్రం రాజక్కపల్లిలోని ధర్మాజి సత్యం ఇంటికి వెళ్లాడని, అక్కడ గొడవ జరగడంతో పారిపోతుండగా పెద్దవాగులో ఈదుకుంటూ వెళ్లి మునిగిపోయినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహంపై గాయాలు ఉండటంతో రాజేందర్ మృతిపై ధర్మాజి సత్యం, ధర్మాజి గంగారాంపై అనుమానాలున్నాయని జయందర్ ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్వేత పేర్కొన్నారు.



మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న యువకులు

తొలిమెట్టుతో అభ్యసన సామర్థ్యం పెంపు

వెల్గటూర్: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు తొలిమెట్టు కార్యక్రమం ఉపయోగపడుతుందని డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. వెల్గటూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల సముదాయ సమావేశ శిబిరాన్ని బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని, ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన చేస్తే అత్యుత్తమ ఫలితాలు సాధిస్తామని పేర్కొన్నారు. తెలుగు, ఆంగ్లం, గణితం బోధనలో లోపాలు సవరించుకోవాలని సూచించారు. తొలిమెట్టు అమలుపై రాష్ట్రస్థాయిలో మానిటరింగ్ వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తోందని తెలిపారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల హాజరు, ప్రగతిపై సమీక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో బత్తుల భూమయ్య, తొలిమెట్టు నోడల్ అధికారి బి.ప్రభాకర్, ప్రధానోపాధ్యాయులు చిప్ప నందయ్య, సబ్జెక్టు రిసోర్స్ పర్సన్లు రవీందర్, శ్రీదేవి, కుమారస్వామి, రిసోర్స్ పర్సన్లు వైద్య వెంకటేశ్, రాజారాణి, రజని తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మారుతి(ఫైల్)

కరీంనగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. కరీంనగర్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌కు చెందిన కల్వల మారుతి(25) మేస్త్రీ పని చేస్తున్నాడు. గత సోమవారం రాత్రి మారుతి, అతని స్నేహితులు కల్యాణ్, రాకేశ్ బైక్‌లపై బొమ్మకల్ బైపాస్ నుంచి హైదరాబాద్ రోడ్డు వైపు వెళ్తున్నారు. మారుతి బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి, పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మారుతి కనిపించకపోవడంతో ముందు వెళ్తున్న కల్యాణ్, రాకేశ్ తిరిగి వచ్చారు. అతని మృతదేహాన్ని అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి తండ్రి పర్శరాములు, తల్లి పద్మ, సోదరి శరిష్మ ఉన్నారు. మంగళవారం కుమారుడి మృతదేహాన్ని చూసి పర్శరాములు స్పృహ కోల్పోవడంతో ఆస్పత్రిలో చేర్పించారు. తన కుమారుడి మృతికి కారణమైన వ్యక్తిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.